కథ

# ఆ రాత్రి-ఓ మనిషి

**జె.సునీల్**

రాత్రి పదకొండు గంటలు దాటింది.

బస్సు విజయవాడ చేరుకుంది. ఓ పదిమంది లగేజీ సర్దుకుని బస్సు దిగుతున్నారు. చాలామంది గాఢనిద్రలోకి జారి ఈ లోకాన్నే మరచిపోయారు. సురేష్‌కి మాత్రం నిద్రపట్టలేదు. మర్నాడు ఉదయం జరగబోయే ఇంటర్వ్యూ గురించే మనసు ఆలోచిస్తూ ఆందోళనపడుతోంది.

మరో పది మంది బస్సెక్కారు. అందరూ సీట్లలో సర్దుకుంటూ ఉంటే, చివరగా ఎక్కిందామె. బస్సంతా కలయచూశాక ఆ ఒక్క సీటే ఖాళీ ఉందని అర్థం చేసుకున్నట్టు అతడి దగ్గరగా నడిచింది. "కూర్చో వచ్చా?"

అప్పుడే అతడు ఆమెను పరిశీలనగా చూశాడు. పాతికేళ్ల వయసుంటుందామెకు. రిచ్‌లేడీలా కనిపిస్తుంది.

"కూర్చోండి"

ఆమె అతడి పక్కనే కూర్చుంది.

బస్సు కదిలింది. పది నిముషాలలోపే ఆమె నిద్రలోకి జారుకుంది. అతడు తిరిగి తన ఆలోచనల్లోకి వెళ్లిపోయాడు. పెద్ద కంపెనీ. మంచి పోస్టు. ఇంటర్వ్యూలో సెలక్టయితే చాలు.... హే భగవాన్! నన్నీ ఇంటర్వ్యూలో సెలక్టయ్యేలా చెయ్యి.

ఆలోచనల మధ్యనే అప్పుడప్పుడే నిద్ర పడుతున్నట్టనిపించింది. అతడు మెల్లగా సీట్లో సర్దుకున్నాడు. చిన్న కుదుపు. బస్సు ఆగింది.

సురేష్‌తో పాటు, ఆమె కూడా ఉలిక్కిపడి కళ్లు తెరిచి, అటునిటు చూసింది. జనాలంతా కంగారుగా ముఖాలు చూసుకోవటం గమనించాక అతడిని అడిగింది.

"ఏమయ్యింది?"

"బస్సు సడెన్‌గా ఆగింది. ఇంజన్‌లో ప్రాబ్లమ్ అనుకుంటా"

డ్రైవర్, కండక్టర్ బస్సు దిగారు. పది నిమిషాల తర్వాత బస్సెక్కి పాసింజర్స్‌తో చెప్పారు. "బస్సు రిపేర్ చేయాలి. వంద అడుగుల దూరంలో బస్టాప్ ఉంది. అర్జెంట్‌గా హైదరాబాద్ వెళ్లాల్సినవారు, లగేజీ తక్కువున్నోళ్లు మాతో వస్తే, అక్కడ్నుంచి ఏదో బస్సెక్కి పంపిస్తాం."

అప్పుడే ఆమె అతడి ముఖంలోకి చూసింది.

"మీరూ బస్టాప్‌కి వస్తారా?"

"మీరూ హైదరాబాద్‌కి అర్జెంట్‌గా వెళ్లాలా?"

"అవునండి.... రేపు ఇంటర్వ్యూలున్నాయి. కాస్త త్వరగా సిటీకి చేరుకోవాలి" ఆమె గొంతులో టెన్షన్ లేదుగానీ, తన అవసరాన్ని వివరిస్తున్న ధోరణి ఉంది.

సురేష్‌కి కాస్త క్యూరియాసిటీ కలిగింది. "మీరు... మీరు కూడా ఇంటర్వ్యూకేనా? ఏ కంపెనీ..?"

ఆమె పేరు చెప్పింది.

సురేష్ అదిరిపడ్డాడు. 'అది... అది తను ఇంటర్వ్యూకి వెళ్తున్న కంపెనీయే! అదే కంపెనీకి ఆమె కూడా ఇంటర్వ్యూకి వెళ్తోంది...' అతడిలో కాస్త అభద్రతా భావం కదలాడింది.

ఆమె నాకన్నా తెలివైనదిలా ఉంది. అందులోనూ అందమైన ఆడది. ఇలాంటి వాళ్లు పోటీలో వుంటే నాకా ఉద్యోగం వచ్చే అవకాశాలు చాలా తక్కువ.

అందుకే... ఆమెను పోటీ నుండి ఎలా తప్పించాలా అని ఆలోచించాడు.

"వెళ్దామా" ఆమె అడిగింది.

అతడు తన లగేజీ అందుకున్నాడు. ఆమె లగేజీ కాస్త బరువెక్కువే ఉంది. అందువల్లే అతడు సహాయం చేస్తాడేమోనని తన వైపు చూసింది. ఆమె చూపులను అతడు పట్టించుకోలేదు. తన లగేజీతో బస్సు దిగేశాడు.

కండక్టర్, డ్రైవర్ ముందు నడుస్తున్నారు. బస్సులో నుండి దిగిన ఓ పదిమంది వారిని అనుసరిస్తున్నారు. పదడుగులు వేశాక ఆమె అడిగింది "కాస్త ఈ లగేజీని పట్టుకోగలరా?"

సురేష్ వెంటనే చెప్పాడు. "సారీ! అలాంటి పనులు నాకలవాటు లేదు."

ఆమె కొద్దిగా ఇబ్బంది పడినట్టు అర్థమవుతూనే ఉంది. అంతేకాదు లగేజీ మోయడానికి ఆమె చాలా కష్టపడుతోంది. కానీ అతడికి మాత్రం ఆమె పట్ల జాలి కలగడం లేదు. ఆమె తనకు 'పోటీ' అన్న భావన, కసి పుట్టేలా చేస్తోంది. అందుకే జాలి అన్న భావన మనసులోకి రాకుండా జాగ్రత్త పడుతున్నాడు.

అందరూ బస్టాప్‌కి చేరుకున్నారు. డ్రైవర్, కండక్టర్ డిపో మేనేజర్‌తో మాట్లాడడానికి లోపలికి వెళ్లారు. జనమంతా తమకు కలిగిన ఇబ్బంది గురించి ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. కొందరు ఆర్టీసీని తిట్టుకుంటున్నారు.

సురేష్ ఆమెనే చూస్తున్నాడు. లగేజీ మోయడంతో అలసిపోయిన ఆమె, అక్కడే ఉన్న సిమెంట్ చప్టా మీద కూలబడిపోయి రొప్పుతోంది.

కండక్టర్, డ్రైవర్ తిరిగొచ్చారు. "బస్సు మరోటి వస్తుంది. మీరందరూ ఆ బస్సులో వెళ్లిపోవచ్చు."

అతడు ఇక తప్పనిసరై ఆమె కూర్చున్న బెంచీ మీదనే కూర్చున్నాడు. అయిష్టంగానూ తలతిప్పి ఆమెకేసి చూశాడు. ఆమె పెదవులు బిగపట్టి ఉంది. కడుపు మీద చెయ్యేసి వత్తుకుంటూ, పక్కలకూ చూస్తోంది.

అడక్కూడదనుకుంటూనే అడిగాడు. "ఏమయ్యింది?"

"కడుపులో నొప్పిగా ఉంది.. ఇఫ్ యూ డోంట్ మైండ్...నా లగేజీ చూస్తుంటారా....బాత్‌రూమ్ వరకూ వెళ్లొస్తాను"

అతడి మనసు ఒక్క క్షణం అదోలా కదిలింది. కానీ అంతలోనే మెదడు తనను గదమాయించింది. 'ఆమె నీకు పోటీదారు. తన పట్ల జాలి చూపిస్తే నీకే సమస్య. తను శారీరకంగానైనా బాధపడి, సమయానికి ఆఫీసుకు చేరుకోకపోతే నీకే లాభం..'

ఆ ఆలోచనతోనే అతడు అన్నాడు. "సారీ! ఒకవేళ ఈలోపు బస్సు వచ్చేస్తే, నెక్స్ట్ బస్సు వరకూ నేనాగలేను"

ఆమె అతడికేసి ఎంత రహస్యంగా చూసిందంటే, ఆ చూపును అతడు జీవితంలో మరచిపోలేడు. అలా చూశాక ఆమె ఒకలాంటి కసితో పలికింది. "ఒకవేళ బస్సొస్తే నో ప్రాబ్లమ్, మీరు లగేజీ అలా వదిలేసి వెళ్లిపోండి" ఆమె అక్కడ క్షణం కూడా నిలవకుండా అక్కడి నుండి కదిలింది.

మరో నిముషానికే డ్రైవర్ కేకేశాడు. "బస్సొచ్చేసింది రండి"

సురేష్ ఆమె సూట్‌కేస్‌కేసి ఓసారి చూశాడు. 'అకారణ ద్వేషం కాదిది. తన భద్రత కోసం పడుతున్న తపన ఇది. అందుకే.... ఇలా వదలి వెళ్లడంలో తప్పులేదు'

మనసెక్కడో 'తప్పు' చేస్తున్నావని హెచ్చరిస్తున్నా, దానిని పట్టించుకోలేదు. నెమ్మదిగా తిరిగి వడివడిగా బస్సు వైపు నడిచాడు.

అతడు బస్సెక్కిన మరు నిముషమే అది కదిలి ముందుకు సాగింది.

★ ★ ★

ఆఫీసు వాతావరణం కాస్త భయపెడుతున్నా, ఏదో తెలియని నమ్మకం తనలో హుషారు పుట్టి


స్తోంది. అనుమానం లేదు... ఈ ఉద్యోగం నాకే వస్తుంది. మనసులోనే అనుకున్నాడు సురేష్.

అతడికి ఎదురుగా మరో ఇద్దరున్నారు. ఇంటర్వ్యూకి హాజరయ్యే వారి సంఖ్య మూడేనని తెలియడంతో అతడికి మరింత ధైర్యం కలిగింది. 'ఏదేమైనా తను తెలివైన పనే చేశాడు. గట్టి పోటీ ఇచ్చే వ్యక్తికి పోటీ నుండి పక్కకు తప్పించాడు'

మొదటి పిలుపు అతడికే వచ్చింది.

డోర్ తెరుచుకుని ఆ ఛాంబర్‌లోకి వెళ్లాడు. 'తనను ఇంటర్వ్యూ చేసే వ్యక్తి ఎవరా?' అని అటు చూశాడు.

మరుక్షణం తన కళ్లు తనను మోసం చేస్తున్నాయేమోనన్న అనుమానం కలిగింది.



అంతలోనే ఇదెలా సాధ్యం అన్న ఆలోచనా పుట్టుకొచ్చింది. చివరికి ఏం జరిగిందో అర్థమయ్యింది. ఆమె 'ఇంటర్వ్యూలున్నాయి. త్వరగా వెళ్లాలి' అంది... అంటే ఇంటర్వ్యూకి హాజరు కావటం కాదు. 'ఇంటర్వ్యూ చేయడం' అన్న మాట. తనే అపార్థం చేసుకుని ఇప్పుడు దోషిలా ఆమె ముందు నిలబడవలసి వస్తోంది.

అప్పుడే అతడు టేబుల్ మీదున్న ఆ నేమ్ ప్లేట్ చూశాడు. 'శ్రీమతి లలితకుమారి. రీజనల్ మేనేజర్'.

ఆమె కూడా తలెత్తి అతడికేసి కూల్‌గా చూస్తోంది. ఆ చూపులు గమనించాకే అతడు ఈ లోకంలోకి వచ్చినట్టు "నమస్తే మేడమ్" అన్నాడు.

తలాడించాక "కూర్చోండి" ఎదురుగా ఉన్న కుర్చీ చూపించింది.

సురేష్ కూర్చున్నాడు.

ఆమె అతడి అప్లికేషన్‌ని పరిశీలించాలి. తలెత్తి అతడి కళ్లల్లోకి చూసింది. "ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్స్ బాగానే ఉన్నాయి. ఈ క్వాలిఫికేషన్స్ చూస్తే నీకు ఉద్యోగం ఇచ్చేయాలి. కానీ...." దీర్ఘంగా నిశ్వసించిందామె.

లలితకుమారి ఏం చెప్పబోతుందో అర్థమైనట్టు అతడు మెల్లగా గొణిగాడు. "రాత్రి నేను ప్రవర్తించిన తీరుకు సా....రీ...."

ఆమె అదోలా నవ్వింది.

"నేను రాత్రి నీ ప్రవర్తన గురించి డిస్కస్ చేయటం లేదు. నా కంపెనీలో పనిచేసే ఉద్యోగి ఎలా ఉండాలని కోరుకుంటున్నానో, నీకు చెప్పబోతున్నాను. నా కంపెనీకి ఆత్మవిశ్వాసం ఉన్న వ్యక్తులు కావాలి. వందమంది పోటీ పడినా నేనే 'విన్నర్'ని అనుకుంటూ ముందుకు దూసుకెళ్లే వ్యక్తులదే నేటి ప్రపంచం. అంతే తప్ప కుళ్లు కుతంత్రం, అసూయాద్వేషాలు, అభద్రతాభావం ఉన్నవాళ్లు నేటి పోటీ ప్రపంచంలో ముందుకు సాగలేరు. నాక్కావలసింది విజేతలే తప్ప, పరాజితులు కాదు. మరి ఈ కోణంలో చూసినప్పుడు, నిన్ను ఈ ఉద్యోగానికి ఎలా సెలెక్ట్ చేయమంటావు?"

సురేష్ కొద్ది సెకనుల పాటు కళ్లు మూసుకున్నాడు.

"నేటి తరం విజేతలలో ఉండే ఓ గొప్ప లక్షణం ఏమిటో నాకర్థమయ్యింది. రాత్రి జరిగిన సంఘటన మనసును బాధపెడుతున్నా, ఆ సంఘటనే నాకో వాస్తవం తెలిసేలా చేసింది. 'నలుగురికీ మంచి చెయ్యరా' అంటారు పెద్దలు. అలా ఎందుకన్నారో కూడా నాకిప్పుడే తెలిసింది...ఎనీహౌ! మనం మళ్లీ కలుద్దాం...మీ ఉద్యోగిగా కాదు ఓ మంచి వ్యక్తిలా మీకు పరిచయం చేయబడుతూ..."

అతడి మాటల్లో కదలాడిన 'నిజాయితీ' గుర్తించింది. ఆమె పెదవుల మీద సంతృప్తితో కూడిన చిరునవ్వు కదలాడింది. 'ఒక వ్యక్తి తాలూకూ అభద్రతాభావం తొలగించి, అతడిలో ఆత్మవిశ్వాసం పెంచి, మంచివాడిగా మార్చడం వలన కలిగిన సంతృప్తి అది.

అందుకే 'బెస్టాఫ్ లక్' అంది మనస్ఫూర్తిగా.

☆